సాక్షి
అన్నమయ్య జిల్లా
ఆదివారం । 30 । జూన్ । 2024



శుభ కార్యాలకు సెలవు

ఈ ఏడాది వరుసగా మూడు నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారాలు పూర్తి స్థాయిలో డీలా పడ్డాయి. -8లో



ఎర్రచందనం దుంగలు స్వాధీనం

వాహనంతో సహా రూ.20 లక్షల విలువైన ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్‌ఓ జె.వి.సుబ్బారెడ్డి తెలిపారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.480	రూ.560
రెండోరకం	రూ.330	రూ.460



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 1097 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	495	522
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 466.40 కిలోలు

న్యూస్‌రీల్

శ్రీ లక్ష్మీనరసింహుడికి విశేష పూజలు



స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి టీటీడీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకొని స్వామివారిని సేవించుకున్నారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

డైట్ కళాశాలల్లో ప్రవేశానికి జులై 4వరకు వెబ్ ఆప్షన్

రాయచోటి టౌన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లా, రాష్ట్ర స్థాయిలో డీఈఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు రెండో విడత వెబ్ ఆప్షన్ అవకాశం జులై 4వ తేదీ వరకు ఉంటుందని డైట్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతిర్మయి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల కేటాయింపు జులై 5వ తేదీ నుంచి 7వ తేదీ వరకు ఉంటుందన్నారు. 9 నుంచి 13వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు.

పర్సన్ ఇన్‌చార్జిల నియామకం

సాక్షి ఎఫెక్ట్..

పెద్దతిప్పసముద్రం: పీఏసీఎస్ (సహకార బ్యాంకులు), డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు పర్సన్ ఇన్‌చార్జిల నియామకం లేకపోవడంతో పాలనా వ్యవహారాలు ముందుకు సాగక అనిశ్చితి నెలకొంది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక నామినేటెడ్ పదవుల్లో ఉన్నవారు రాజీనామా చేశారు. ఇన్నాళ్లు బ్యాంకు సీఈఓ, చైర్మన్‌లకు ఉన్న జాయింట్ చెక్ పవర్‌తో పాలన సాగేది. చైర్మన్లు రాజీనామా చేయడంతో అత్యవసరంగా నిధులు డ్రా చేసే అవకాశం లేకుండా పోయింది. ఈ విషయంపై ఈ నెల 27న సాక్షి పత్రికలో వెలువడిన 'పర్సన్ ఇన్‌చార్జిల నియామకమెప్పుడో ' వార్తకు జిల్లా ఉన్నతాధికారులు స్పందించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 76 పీఏసీఎస్‌లకు అసిస్టెంట్ రిజిస్ట్రార్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా, డీసీసీబీ, డీసీఎంఎస్‌లకు జిల్లా జాయింట్ కలెక్టర్లను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించారు. పెద్దతిప్పసముద్రం పీఏసీఎస్‌కు మదనపల్లికి చెందిన అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్యాం ప్రకాష్‌రెడ్డిని పర్సన్ ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు బ్యాంకు సీఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

వైవీయూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా రఘునాథరెడ్డి

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి రిజిస్ట్రార్‌గా ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి నియమితులయ్యారు. ఇప్పటివరకు రిజిస్ట్రార్‌గా బాధ్యతలు నిర్వహించిన ఆచార్య వై.పి. వెంకట సుబ్బయ్య శనివారం రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో విశ్వవిద్యాలయ పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్న సీనియర్ ఆచార్యులు ఎస్. రఘునాథరెడ్డిని నియమిస్తూ వీసీ ఆచార్య చింతా సుధాకర్ ఉత్తర్వులు జారీచేసి నియామక పత్రాన్ని అందజేశారు.

అతిసార నిర్మూలనకు ప్రణాళికాబద్ధమైన చర్యలు



అతిసార వ్యాధి నిర్మూలనపై సమీక్ష చేస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి: అతిసార వాధి నిర్మూలనకు పరిశుభ్రత, నాణ్యమైన నీటి సరఫరాలే కీలకమని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పేర్కొన్నారు. శనివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్‌లో అతిసార వ్యాధి నిర్మూలన ప్రచార కార్యక్రమం-2024పై ఆయన జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ పంచాయతీ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, విద్య, ఐసీడీఎస్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో జిల్లా స్థాయి టాస్క్‌ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతిసార వ్యాధి ఇప్పటికే దేశంలో ముఖ్యమైన ప్రజారోగ్య సమస్యగా ఉందన్నారు. అతిసార వ్యాధి వల్ల ఐదు సంవత్సరాలలోపు పిల్లలలో 5.8 శాతం పిల్లలు చనిపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో అతిసార వ్యాధిని పూర్తిగా అరికట్టేందుకు విద్య, వైద్య, గ్రామీణ నీటి సరఫరా, మున్సిపాల్టీ తదితర శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. అతిసార వ్యాధి వ్యాప్తిపై ప్రజలలో అవగాహన కల్పించాలని తెలిపారు. అతిసార వ్యాధి కార్యక్రమంపై పిల్లలందరికీ అవగాహన కల్పించి వ్యాస రచన పోటీలను నిర్వహించాలన్నారు. జిల్లాలోని నీటి సరఫరా పైపులైన్లలో ఎలాంటి కాలుష్యం జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సేవకు శ్రీకారం..

మా అమ్మ ఒడితో సాకారం

సమాజ సేవకు మేముసైతం అంటూ రెవెన్యూ సేవా సంస్థ అడుగు ముందుకేసింది. అనాథ పిల్లలను అక్కున చేర్చుకోవడమే లక్ష్యంగా 'మా అమ్మ ఒడి'కి శ్రీకారం చుట్టింది. ఎంతోమందిని విద్యాబుద్ధులు నేర్పిస్తూ.. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ విజయవంతంగా ముందుకు సాగుతోంది. రాష్ట్రంలోనే తొలిసారిగా రెవెన్యూ ఆధ్వర్యంలో నడుస్తున్న 'మా అమ్మ ఒడి'పై ప్రత్యేక కథనం.

- రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల నిర్వహణ
- రెవెన్యూ ఆధ్వర్యంలో రాష్ట్రంలో తొలిసారి
- ఉన్నత స్థానాల్లో రాణిస్తున్న విద్యార్థులు



మా అమ్మ ఒడి భవనం

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలో తొలిసారి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు సమాజ సేవకు ముందుకొచ్చారు. రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో 'మా అమ్మ ఒడి'కి శ్రీకారం చుట్టారు. 2005 ఆగస్టు 15న కలెక్టర్ గోపాలకృష్ణపిళ్లై అశోక్‌కుమార్ కడప రాధాకృష్ణనగర్‌లోని ఓ అద్దె భవనంలో ఈ సంస్థను ప్రారంభించారు. కలెక్టర్ ఎక్స్ అఫీషియో అధ్యక్షునిగా వ్యవహరించే ఈ సంస్థ దాతల సహకారంతో నడుస్తోంది. ఇందులో ఆశ్రయం పొందిన పలువురు పిల్లలు ఇంజనీరింగ్, ఎంబీఏ వంటి ఉన్నత విద్యలు పూర్తి చేసి మంచి ఉద్యోగాల్లో రాణిస్తున్నారు.

'బాధ్యత' గుర్తెరిగి..

వీధి పిల్లలు, ముఖ్యంగా అనాథ పిల్లలను ఎవరూ పట్టించుకోకపోతే అసాంఘిక శక్తులుగా మారే ప్రమాదం లేకపోలేదు. వీరిని మెయిన్ స్ట్రీమ్‌లోకి తీసుకొచ్చి బాధ్యతగల పౌరులుగా, గౌరవ ప్రదంగా జీవించేందుకు దోహదపడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా రెవెన్యూ ఉద్యోగులు గుర్తించారు. అందుకే తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు తొలి ప్రాధాన్యతగా, ఎవరో ఒకరిని కోల్పోయిన సెమీ ఆర్ఫన్స్‌కు ద్వితీయ ప్రాధాన్యత ప్రాతిపదికన 'మా అమ్మ ఒడి'లో ప్రవేశం కల్పిస్తున్నారు. వీరికి భోజనం, వసతి, నాణ్యమైన విద్య అందిస్తున్నారు. మొత్తం 80 మందికి ప్రవేశం కల్పించాలన్నది లక్ష్యం కాగా, ప్రస్తుతం 70 మంది ఉన్నారు. రెవెన్యూ ఉద్యోగుల విరాళాలు, ఇతర దాతల సహకారంతో మా అమ్మ ఒడి విజయవంతంగా నడుస్తోంది. అద్దె భవనంలో ఉన్నప్పుడు 24 మంది పిల్లలకే అవకాశం ఉండేది. దీంతో సొంత భవనాన్ని నిర్మించుకోవాలని భావించారు. అందుకోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని నాటి కలెక్టర్ శశిభూషణ్‌కుమార్‌కు విన్నవించారు. ఆయన వెంటనే స్పందించి కడప మండలం చిన్నచౌకు గ్రామ పొలం సర్వే నెంబర్లు 1032/15, 1032/16లో 0.95 సెంట్ల స్థలం మంజూరు చేశారు. ఆ స్థలంలో మా అమ్మ ఒడి, వృద్ధాశ్రమం, పాఠశాల వరుస క్రమంలో ఏర్పాటు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. రూ. 85 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన మా అమ్మ ఒడి నిర్మాణానికి 2010 మార్చి 28న కలెక్టర్ శశిభూషణ్‌కుమార్ భూమి పూజ నిర్వహించగా, జాయింట్ కలెక్టర్ ఎం.గిరిజా శంకర్, డీఆర్వో హేమసాగర్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్, జేసీ చొరవతో రూ. 50 లక్షల నగదు, రూ. 17 లక్షలు విలువజేసే భవన నిర్మాణానికి అవసరమయ్యే మెటీరియల్ విరాళాల రూపంలో సమకూరాయి. ముంబైకి చెందిన హెచ్‌పీసీఎల్ సంస్థ రూ. 55 లక్షల వ్యయంతో ఉచితంగా మొదటి అంతస్తు నిర్మాణం పూర్తి చేసి అప్పగించింది. దీంతో 2011 జూన్‌లో పిల్లలను అద్దె భవనం నుంచి కొత్తగా నిర్మించిన సొంత భవనంలోని గ్రౌండ్‌ఫ్లోర్‌లోకి తరలించారు. ఆ తర్వాత కలెక్టర్ కేవీ రమణ సలహా మేరకు 2017-18 విద్యా సంవత్సరం నుంచి ప్రాథమికోన్నత ఇంగ్లీషు మీడియం పాఠశాల ప్రారంభించారు. ఇందులో మా అమ్మ ఒడికి చెందిన 40 మంది పిల్లలతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన 140 మంది పేద పిల్లలకు ప్రవేశం కల్పించారు. బయటి పిల్లలు నామమాత్రపు ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. ఇతర పాఠశాలల్లో వసూలు చేసే ఫీజులతో పోలిస్తే 1/3, కార్పొరేట్ పాఠశాలలో పోలిస్తే 1/5గా ఈ ఫీజులు ఉన్నాయి. పిల్లలను చదువులోనే కాకుండా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేలా చూస్తున్నారు. కలెక్టర్ కేవీ సత్యనారాయణ ఉన్న సమయంలో పిల్లలకు కరాటే శిబిరాన్ని నిర్వహించారు. మా అమ్మ ఒడి ఆవరణలో రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో 2005 నుంచి నేటి దాకా యేటా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. నాటి జాయింట్ కలెక్టర్ కాంతిలాల్ దండే మొదలు అనేకమంది తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ ఉద్యోగులు రక్తదానంలో భాగస్వాములు కావడం విశేషం.

రాణించిన పలువురు విద్యార్థులు

మా అమ్మ ఒడిలో చదివి పలువురు విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. కడప నగరానికి చెందిన తేజ 2016లో స్విస్ట్ కళాశాలలో ఇంజనీరింగ్ పూర్తి చేసి హైదరాబాదు, బెంగుళూరులలో చిన్న చిన్న ఉద్యోగాలు చేశారు. ప్రస్తుతం బెంగుళూరులో ఉంటూ ఢిల్లీకి చెందిన వాజీరాం రవి ఐఏఎస్ కోచింగ్ సెంటర్ నుంచి ఆన్‌లైన్ ద్వారా శిక్షణ తీసుకుంటున్నారు. మరికొందరు విద్యార్థులు పోటీ పరీక్షల్లో నెగ్గి సచివాలయాలు, ఇతర ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాలు చేస్తున్నారు.



మా అమ్మ ఒడి ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాల

సమష్టి కృషి ఫలితమే



జిల్లా రెవెన్యూ ఉద్యోగుల సమిష్టి కృషి ఫలితంగానే నేడు 'మా అమ్మ ఒడి' విజయవంతంగా నడుస్తోంది. సమాజ సేవలో రెవెన్యూ ఉద్యోగులు భాగస్వాములు కావడం రాష్ట్ర చరిత్రలో ప్రథమం. ఎక్స్ అఫిషియో అధ్యక్షులుగా వ్యవహరించే కలెక్టర్ల సహకారం మరువలేనిది. ఉమ్మడి జిల్లాలోని అనాథ పిల్లలకు మాత్రమే ఇక్కడ ప్రవేశం ఉంటుంది. ఒకవేళ ఖాళీలు ఉంటే పక్క జిల్లాల వారికి కూడా అవకాశం కల్పిస్తాం. ఇక్కడ చదివిన పలువురు పిల్లలు నేడు ఉన్నత రంగాల్లో రాణించడం మాకు గర్వకారణం.

– లెక్కల ప్రభాకర్‌రెడ్డి, గౌరవ ఉపాధ్యక్షుడు, రెవెన్యూ సేవా సంస్థ, కడప

మా అమ్మ ఒడి తోడ్పాటుతోనే..



మాది చాపాడు మండలం పెద్దచియ్యపాడు గ్రామం. తల్లిదండ్రులిద్దరూ నా చిన్నతనంలోనే చనిపోవడంతో తొండూరు మండలం భద్రంపల్లెలోని మా అవ్వాతాత ఇంటిలో పెరిగాను. నాల్గవ తరగతిలో మా అమ్మ ఒడిలో చేరి పదవ తరగతి వరకు ఇక్కడే చదివాను. కుసుమ మేడమ్, శివాజీ సార్ స్పాన్సర్ చేశారు. ఆర్టీసీ అధికారి శ్రీలక్ష్మి మేడమ్ సహకారంతో విజయవాడ శ్రీభాష్య జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ 2021లో పూర్తయింది. ఇప్పుడు తమిళనాడు రాష్ట్రం తిరుచురాపల్లి ఎన్ఐటీలో ఇంజనీరింగ్ నాల్గవ సంవత్సరం చదువుతున్నాను. ప్రస్తుతం బెంగుళూరు మైక్రో సాఫ్ట్‌లో ఇంటర్న్‌షిప్ చేస్తున్నాను. శ్రీలక్ష్మి మేడమ్ ఆమె కొడుకుతో సమానంగానే నన్ను పెంచుతోంది. అందుకే ఆమెను 'అమ్మ' అని పిలుస్తాను. ఇంజనీరింగ్ పూర్తి కాగానే ఎంఎస్ లేదా ఎంబీఏ చేయాలని భావిస్తున్నాను. మా అమ్మ ఒడిలో తహసీల్దార్ ప్రభాకర్ రెడ్డి ప్రోత్సాహం, భరోసా ఎన్నటికీ మరిచిపోలేను. మా అమ్మ ఒడి తోడ్పాటుతోనే నేను ఈ స్థాయికి చేరుకున్నాను. -ప్రవీణ్‌కుమార్

నిర్లక్ష్యంగా పనిచేస్తే కఠిన చర్యలు

డ్వామా పీడీ మద్దిలేటి



సామాజిక తనిఖీ బహిరంగ సభలో ఉపాధి హామీ సిబ్బందిని ప్రశ్నిస్తున్న డ్వామా పీడీ మద్దిలేటి

నిమ్మనపల్లె: ఉపాధి హామీ సిబ్బంది నిర్లక్ష్యంగా పనిచేస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా డ్వామా పీడీ మద్దిలేటి అన్నారు. శనివారం స్థానిక ఉపాధి హామీ స్త్రీ శక్తి భవన ఆవరణంలో 18వ విడత సామాజిక తనిఖీ బహిరంగ సభ ఉపాధి హామీ ఏపీఓ రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 2023-2024 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో చేపట్టిన పనుల వివరాలను, సామాజిక తనిఖీ డీఆర్పీలు సభలో పంచాయతీల వారీగా, చేసిన పనుల వారీగా వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక తనిఖీ వివరాలను పరిశీలిస్తే ఉపాధ్యాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో సక్రమంగా పనిచేయలేదని అర్థమవుతోందన్నారు. పనితీరు మార్చుకోకపోతే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సిబ్బందిని హెచ్చరించారు. ఉపాధి హామీ పథకానికి సంబంధించిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, ఉద్యోగులు క్రమశిక్షణతో పని చేయాలన్నారు. 2023-24 సంవత్సరంలో ఉపాధి హామీ పథకం ద్వారా మండలంలో 1505 పనులకు రూ.3,20,29,779 కోట్లను ఖర్చుచేశామన్నారు. ఉపాధి హామీ క్షేత్రస్థాయి సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్‌ల నిర్లక్ష్యం కారణంగా కొన్ని లోపాలను గుర్తించామన్నారు. చేసిన పనుల కొలతలకు, తనిఖీ బృందం గుర్తించిన పనుల కొలతలకు తేడాలు ఉన్నాయన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన రెడ్డివారిపల్లె టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పనులలో లోపాలకు కారణమైన సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తున్నామన్నారు. వారి వద్ద నుంచి రికవరీ చేస్తున్నామన్నారు. సిబ్బంది పనితీరు మెరుగుపరుచుకునేలా చర్యలు తీసుకోవాలని ఏపీఓ రమేష్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వెలుగు పీడీ సత్యనారాయణ, ఉపాధి హామీ ఏపీఓ ప్రకాష్, వెలుగు డీపీఎం ధర్మరాజు, సోషల్ ఆడిట్ ఎస్టీఎం లోకేశ్వర్ రెడ్డి, ఏపీడీ నందకుమార్, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

బొప్పాయి పండు.. రూపాలు రెండు



వినాయకుడి తొండం ఆకారంలో బొప్పాయి



హంస ఆకారంలో ఉన్న బొప్పాయి

మండల కేంద్రమైన గుర్రంకొండలో హంస, వినాయకుడి ఆకారంలో బొప్పాయి పండ్లు కనిపించాయి. ఈ బొప్పాయి పండ్లు గ్రామస్తులను ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. మండలంలోని కొత్తపల్లెలో ఓ బొప్పాయి తోటలో ఇలాంటి ఆకారం కలిగిన బొప్పాయిలను రైతులు తీసుకొచ్చారు. వింత ఆకారంలో ఉన్న వీటిని చూసేందుకు పలువురు ఆసక్తి కనబరిచారు.

– గుర్రంకొండ

స్కౌట్‌తో క్రమశిక్షణ, దేశభక్తి

మంత్రి ఎం.రాంప్రసాద్‌రెడ్డి



స్కౌట్ విద్యార్థులు, అధికారులతో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటి అర్బన్: స్కౌట్ శిక్షణతో దేశభక్తి, క్రమశిక్షణ పెంపొందుతుందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి ఎం. రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. శనివారం రాయచోటిలో ఆయనను జిల్లా స్కౌట్ సెక్రటరీ, గైడ్ కెప్టెన్‌లతో కలసి స్కౌట్ విద్యార్థులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో స్కౌట్ అండ్ గైడ్స్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అకడమిక్ క్యాలెండర్ ఆధారంగా స్కౌట్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు, గురువులతో మర్యాద పూర్వకంగా వ్యవహరిస్తూ సమాజం పట్ల బాధ్యతగా మెలిగేందుకు స్కౌట్స్ శిక్షణ ఎంతో తోడ్పడుతుందన్నారు. విద్యార్థులంతా స్కౌట్స్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ ఎం. నరసింహారెడ్డి, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ లక్ష్మికర్, గైడ్ కెప్టెన్ హేమలతతో పాటు పలువురు స్కౌట్ విద్యార్థులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : వేర్వేరు ఘటనల్లో నలుగురు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. బి.కొత్తకోట మండలం రఘునాథపురం-కదిరి రోడ్డులో ఉన్న ఎ.శంకరరెడ్డి(55) చిల్లర దుకాణం నిర్వహిస్తున్నాడు. కుటుంబ సమస్యలతో ఇంటి వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా చౌడేపల్లె మండలం ఎల్లంపల్లికి చెందిన మైనర్ బాలిక (15)ను తన తల్లిదండ్రులు మందలించడంతో మనస్థాపం చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. పుంగనూరు పట్టణం శాంతినగర్‌కు చెందిన సరస్వతి(25) కుటుంబ సమస్యలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అదే విధంగా మదనపల్లె పట్టణం గౌతమీ నగర్‌కు చెందిన రెడ్డి బాషా కుమారుడు షేక్ అల్తాఫ్(24) కుటుంబ సమస్యలతో శుక్రవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబసభ్యులు బాధితులను 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఎ.శంకర్‌రెడ్డి, మైనర్ బాలిక పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

అన్ని వేళల్లో ప్రజలకు అందుబాటులో ఉంటాం

రాయచోటి టౌన్ : అన్ని వేళ్లలో ప్రజలకు అందుబాటులో ఉంటామని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు అన్నారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పోలీస్ కార్యాలయంలో శనివారం జరిగిన సన్మాన కార్యక్రమంలో పదవీ విరమణ పొందిన ఎస్‌ఐ బ్రహ్మయ్య (1430), ఏఎస్‌ఐ కె.నరసింహులు(1691), ఏఆర్‌హెచ్‌సీ సి.కుళ్లాయరెడ్డి(457)లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేయింబవళ్లు విధులు నిర్వర్తించిన ఉద్యోగి పోలీస్ ఒక్కడేనని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ డాక్టర్ వివి.రాజ్‌కమల్, ఏఎఓ కృష్ణుడు, ఏఆర్ డీఎస్పీ బి.చిన్నికృష్ణ, హోంగార్డ్ ఆర్‌ఐ వెంకటా చలపతి, ఎంటీవో ఆర్‌ఐ యం.పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.



సన్మానితులతో జిల్లా ఎస్పీ కృష్ణారావు

శుభ కార్యాలకు సెలవు

ఉరుము ఉరిమి మంగళంపై పడిందన్న చందంగా వివాహాలకు తగిన ముహూర్తాలు లేకపోవడం వాటి ఆధారిత రంగాలపై ప్రభావం చూపుతోంది. ఈ రంగంపై ఆధారపడిన పలు వ్యాపారాలు మూడు నెలలపాటు మూతపడడంతో అందులో జీవిస్తున్న చిరుద్యోగుల ఊపిరి ఊడ్చేసినట్లయింది. ఎక్కడా మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛాటనలు వినిపించకపోవడంతో ఆ రంగంపై ఆధారపడ్డ చిరుద్యోగుల ముఖాల్లో కళ తప్పింది.

- ఉపాధిని ఊడ్చేసిన శూన్యమాసం
- వివాహ ఆధారిత వ్యాపారాలు నిల్
- కుదేలవుతున్న వ్యాపార రంగాలు



కడప కల్చరల్ : ఉమ్మడి జిల్లాలో వస్త్ర, నగలు, ఇతర వ్యాపార రంగాలు కుదేలవుతున్నాయి. ఈ ఏడాది వరుసగా మూడు నెలల పాటు వివాహ ముహూర్తాలు లేకపోవడంతో ఆయా రంగాలపై ఆధారపడిన వ్యాపారాలు పూర్తి స్థాయిలో డీలా పడ్డాయి. సాధారణంగా వివాహ ముహూర్తాలు ఉన్న సమయంలో వధూ వరులు, వారి బంధు మిత్రుల కుటుంబాల్లోనేగాక వివాహ నిర్వహణకు అవసరమయ్యే వ్యాపార వర్గాల్లోనూ ఆనందోత్సాహాలుంటాయి. ప్రస్తుతం మూఢంతోపాటు సరైన ముహూర్తాలు లేక పెళ్లి బాజాలు ఎక్కడా వినిపించడం లేదు. ఈ పరిస్థితి దాదాపు మూడు నెలల పాటు ఉంటుంది. జులై 5వ తేదీ నుంచి ఆషాడ మాసం ప్రారంభమవుతున్నందున ఈ మాసంలో కూడా పూర్తి స్థాయిలో వివాహాలుండవు. ఆషాడంను శూన్య మాసంగా భావిస్తారు. ఈ మాసంలో వివాహాలు, ప్రారంభోత్సవాలు, గృహ ప్రవేశాలు ఇతర శుభ కార్యాలను తలపెట్టరు. నూతన వ్యాపారాల ప్రారంభం, రిజిస్ట్రేషన్లు, ప్రారంభోత్సవాలు, నామకరణాలు వంటి కార్యక్రమాలు తలపెట్టరు. శ్రావణం తర్వాత సెప్టెంబరు 4వ తేదీ నుంచి మరోసారి శూన్య మాసం రానుంది. వినాయక చవితి పండగ తెచ్చే భాద్రప్రద మాసం శూన్య మాసం కావడంతో అక్టోబరు 3వ తేదీ వరకు శుభకార్యాలు తలపెట్టే అవకాశం లేదు. ఇప్పటికే ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు మూఢం కారణంగా వివాహాలు లేకపోవడంతో శుభకార్యాల కళ తప్పింది.

ఎదురుచూడక తప్పదు

వివాహ ముహూర్తాల కోసం మరిన్ని నెలల పాటు ఎదురు చూడక తప్పదు. వచ్చే ఏడాది వరకు శుభకార్యాలకు అనువైన ముహూర్తాలు లేవని పండితులు పేర్కొంటున్నారు. సంవత్సరం చివర డిసెంబరు మార్గశిర మాసంలో పెళ్లిళ్లకు అనుకూలంగా ఉన్నా బలమైన ముహూర్తాలు కావని వేద పండితులు ఆసక్తి చూపడం లేదు. జనవరి 30వ తేదీన మాఘ మాసం ప్రవేశిస్తున్న కారణంగా ఆ ముహూర్తాల్లో శుభ కార్యాలు తలపెట్టడం మంచిదని సూచిస్తున్నారు. అప్పటివరకూ ఎదురుచూడక తప్పదని స్పష్టం చేస్తున్నారు. ఆ తర్వాత ఫాల్గుణ మాసంలో వివాహాలకు మంచి ముహూర్తాలు ఉండడంతో ఫిబ్రవరి చివరి నుంచి మార్చి చివరి వరకు వరుస ముహూర్తాలతో శుభకార్యాలు చేసుకోవచ్చని సూచిస్తున్నారు. అనుకోని అవాంతరాల కారణంగా ఇప్పటికే వివాహాలు ఆలస్యమవుతున్నాయనే భావన కలిగితే తప్పనిసరిగా భావించి వివాహాలకు సిద్ధమయ్యే అవకాశాలు లేకపోలేదు. ఆగస్టు 5వ తేదీ నుంచి శ్రావణమాసం ప్రారంభం కానుండడంతో మరో అరడజను ముహూర్తాలు ఉన్నాయని తెలుపుతున్నారు.

ఊడ్చుకుపోయిన ఉపాధి

వివాహాలు లేకపోవడంతో ఆ రంగంపై ఆధారపడి జీవిస్తున్న చిరుద్యోగులు, వ్యాపారులు ఉపాధిలేక ఉసూరుమంటున్నారు. కార్పొరేట్ స్థాయి వివాహ నిర్వహణ సంస్థలు, కల్యాణ మండపాల వ్యాపారులు, బంగారం, కేటరింగ్, భోజనాల తయారీ రంగం, డెకరేషన్, వీడియో, ఫోటోగ్రాఫర్లు, పురోహితులు, ట్రావెలింగ్ రంగాలు పనిలేక స్తబ్దంగా ఉన్నాయి. ఈ పరమైన వ్యాపారం ఇన్ని నెలలపాటు లేకపోవడంతో దీనికి సంబంధించి దాదాపు రూ.1000 కోట్లకు పైగా వ్యాపారాలకు బ్రేక్ పడింది. ఈ ప్రభావం చిరు వ్యాపారులు, వివాహ రంగంపై ఆధారపడిన దినసరి కూలీలపై ఎక్కువగా ఉంది.

పెట్టుబడి పేరుతో మోసం

రూ.3.14 లక్షలు నష్టపోయిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

బి.కొత్తకోట : స్టాక్స్‌లో పెట్టిన పెట్టుబడులకు పెద్ద మొత్తంలో లాభాలిస్తామని నమ్మించి లక్షల రూపాయలు దోచుకుంటున్న ట్రేడింగ్ కంపెనీ ఉదంతం శనివారం బి.కొత్తకోటలో వెలుగుచూసింది. ఓ బాధితుడి ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ విభాగం పోలీసులు కేసు నమోదు చేయగా మరికొందరు బాధితులు వెలుగులోకి వచ్చారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి..

బి.కొత్తకోట పట్టణానికి చెందిన ఓ యువకుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మే నెలలో ఓ కంపెనీకి సంబంధించిన కొందరు అడ్మిన్లు వాట్సాప్ గ్రూప్ ఏర్పాటుచేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మొబైల్ నంబర్‌ను యాడ్‌చేశారు. ఇందులో ఇ ట్రేడ్ బై మోర్గాన్ స్టాన్లీ యాప్ సంస్థ పేరుతో స్టాక్స్‌లో పెట్టుబడులు పెడితే ఎక్కువ డబ్బిస్తామని చెప్పి నమ్మించారు. మే, జూన్ నెలల్లో స్టాక్స్‌లో చిన్న మొత్తాలతో పెట్టుబడులు పెట్టమని ఆ ఉద్యోగి సూచనలు చేయగా అతడు లా చేస్తూ వచ్చాడు. అప్పటివరకు ఎలాంటి ఇబ్బంది కలగకపోవడంతో నమ్మకం వచ్చింది. పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టాలని సూచించడంతో రూ.3,14,300 పెట్టుబడి పెట్టిన తర్వాత సంస్థ నిర్వాహకుల వైఖరి మారిపోయింది. ఉన్నట్టుండి యాప్‌ను లాక్ చేశారు. ఎందుకిలా చేశారని ఇ ట్రేడ్ బై మోర్గాన్ స్టాన్లీ యాప్ అడ్మిన్లకు ప్రశ్నించినా, వివరణ కోరినా కనీసం స్పందించలేదు. ఈ నెల 8న స్పందించిన అడ్మిన్ రూ.3.50 లక్షలు చెల్లించి మరొక ఐపీఓ కొనుగోలు చేస్తే ఇంతకు మునుపు పెట్టిన పెట్టుబడి కలిసి వస్తుందన్నారు. అయితే అతడికి అనుమానం కలగడంతో ఆ బాధిత ఉద్యోగి డబ్బు చెల్లించకుండా తనను నమ్మించి మోసం చేశారని గ్రహించి 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించి ఇ ట్రేడ్ బై మోర్గాన్ స్టాన్లీ యాప్ వాట్సప్ గ్రూప్ అడ్మిన్లు, అందులోని సభ్యులైన వారి ఫోన్ నెంబర్ల వివరాలను బాధితుడు పోలీసులకు అందజేశారు. కాగా దీని బారిన పడి బి.కొత్తకోటకు చెందిన ఎందరో నిరుద్యోగులు లక్షల రూపాయలు మోసపోయినట్టు తెలుస్తోంది. ఫిర్యాదు చేసేందుకు బాధితులు ముందుకు రావడం లేదు. ఇలాంటి వాటిని నమ్మి మోసపోతున్న వారిలో విద్యావంతులుండడం ఆందోళన కలిగిస్తోంది.

జడల స్వామి శివైక్యం



జడల స్వామి (ఫైల్)

రాజంపేట టౌన్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు అవధూతగా కొలిచే జడల స్వామి శనివారం శివైక్యం చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్యం విషమించడంతో శనివారం ఆయన తుదిశ్వాస విడిచారు. జడలస్వామి మూడు దశాబ్దాల కిందట రాజంపేటకు వచ్చారు. గత ఆరేళ్లుగా పట్టణ శివారులోని కూచివారిపల్లెలో ఉంటున్నారు. ఆయన ఏ దుకాణం వద్దకు వెళ్తే అక్కడ వ్యాపారం బాగుంటుందని ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఆయన రాగానే దుకాణ యజమానులు ఆహారపదార్థాలు అందించి ఆయనకు కొన్ని కాగితాలు ఇచ్చేవారు. అనంతరం వాటిరి తిరిగి ఇస్తే తమ వద్ద ఉంచుకునేవారు. శుభ కార్యాలు మొదలుపెట్టే సమయంలో అవధూత వద్ద ఆశీర్వాదం పొందేవారు. పట్టణానికి చెందిన ప్రముఖులు, విద్యా వంతులు, వివిధ శాఖల అధికారులు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఆయన ఆశీర్వాదం పొందేవారు. ఆయన నెలల తరబడి స్నానం చేయకపోయినా ఆయన వద్ద దుర్వాసన వచ్చేది కాదని భక్తులు చెబుతారు. ఆయన శివైక్యం చెందారనే విషయం తెలుసుకుని పట్టణానికి చెందిన భక్తులు పెద్ద ఎత్తున కూచివారిపల్లెకు చేరుకుని కన్నీరు మున్నీరయ్యారు.

నేడు అంత్యక్రియలు

జడల స్వామి అంత్యక్రియలను ఆదివారం ఉదయం పది గంటలకు కూచివారిపల్లె సాయిబాబా గుడి వద్ద నిర్వహిస్తున్నట్లు భక్తులు తెలిపారు. భక్తుల సందర్శనార్థం పార్థివ దేహాన్ని సాయిబాబా గుడి వెనకవైపు ప్రాంగణంలో ఉంచనున్నట్లు తెలిపారు.

వెన్నెల రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

మదనపల్లె : మండలంలోని కొండామారిపల్లె పంచాయతీ బైపాస్ రోడ్డులోని వెన్నెల రెస్టారెంట్‌లో శనివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ ఇన్స్‌పెక్టర్ శివప్ప తెలిపారు. షార్ట్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగిందని గుర్తించి మంటలు అదుపు చేసినట్లు అగ్నిమాపక సిబ్బంది తెలిపారు. వెన్నెల రెస్టారెంట్ యజమాని చలపతి మాట్లాడుతూ.. ప్రమాదంలో లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని, రూ.5 లక్షల విలువైన ఆస్తిని అగ్నిమాపక అధికారులు కాపాడినట్లు తెలిపారు.



వెన్నెల రెస్టారెంట్‌లో అగ్నిప్రమాదం

పూరి గుడిసె దగ్ధం

సిద్దవటం : రెక్కాడితే డొక్కాడని ఓ నిరుపేద పూరి గుడిసె శుక్రవారం దగ్ధమైంది. సిద్దవటం మండలం రామస్వామిపల్లెలో విద్యుత్తు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి యాకసిరి సుబ్బమ్మ పూరి గుడిసె కాలిపోయింది. మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో గుడిసెలోని నిత్యావసర వస్తువులు, ఇతర సామాగ్రి కాలి బూడిదవడంతో నిరుపేద కుటుంబం లబోదిబోమంది. తహసీల్దారు మురాషావలి ఆదేశాలతో వీఆర్వో నాని గ్రామానికి వెళ్లి యాకసిరి సుబ్బమ్మ ఇంటిని పరిశీలించారు. ఆమె అడవికి మేకలు తోలుకుపోగా ఈ ఘటన జరిగిందని తెలిపారు. నష్టాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని వీఆర్వో తెలిపారు.

పిస్తోల్‌తో దాడి చేసిన వ్యక్తి అరెస్టు

చిన్నమండెం : పిస్తోల్‌తో దాడికి పాల్పడిన పాపారావునాయుడును అరెస్టు చేసినట్లు రాయచోటి రూరల్ సీఐ తులసీరామ్ తెలిపారు. చిన్నమండెం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడుతూ వైఎస్‌ఆర్ సీపీ నాయకుడు పుల్లగూర శ్రీరాములు పొలం దున్నుతుండగా ఆ స్థలం మాది అంటూ పాపారావు నాయుడు పిస్తోల్‌తో దాడికి పాల్పడ్డారన్నారు. తలపై కొట్టడంతో రైతుకు గాయాలవగా గ్రామస్థులు వారించి పిస్టోల్ లాక్కోవడంతో నిందితుడు పరారైనట్లు తెలిపారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలియజేశారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

పీలేరు : వాహనంతో సహా రూ.20 లక్షల విలువైన ఎర్ర చందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు డీఎఫ్‌వో జె.వి.సుబ్బారెడ్డి తెలిపారు. అటవీ అధికారులు శనివారం తెల్లవారుజాము నుంచి రాయచోటి-రాజంపేట మార్గంలోని నాయునివారిపల్లె సమీపంలో తనిఖీలు నిర్వహించారు. మహీంద్ర ఎక్స్‌యూవీ వాహనంలో ఎర్రచందనం దుంగలు లోడ్ చేస్తుండగా అటవీ అధికారులను గమనించిన దుండగులు వాహనాన్ని వదలి పరారయ్యారు. వాహనంలో 305 కిలోల బరువు గల పది ఎర్రచందనం దుంగలున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వెంకటరమణ, కె.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్న అధికారులు

చోరీ కేసులో నిందితుడి అరెస్టు

మదనపల్లె : చోరీ కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ ఎస్.శేఖర్ తెలిపారు. మే 30న మండలంలోని నిడుమూరు గ్రామంలోని గంగాధర పొలంలో 120 మీటర్ల కేబుల్ వైర్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శనివారం తట్టివారిపల్లె జంక్షన్ వద్ద నిందితుడు నిడుమూరుకు చెందిన దిన్నెపాటి మల్లికార్జున అలియాస్ చిన్నమల్లయ్య(34)ను అరెస్ట్ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

గుర్రంకొండ : గుర్రంకొండ పట్టణంలోని జజారు వీధిలో ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. స్థానిక జామియా మసీదు వద్ద కాలేషా మస్తాన్ నివాసముంటున్నాడు. శుక్రవారం రాత్రి ఇంటి ముందు హోండా యాక్టివా వాహనం నిలిపాడు. శనివారం ఉదయం వచ్చిచూసే సరికి కనబడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ప్రైవేటు ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

మదనపల్లె: తాళం వేసి ఉన్న ప్రైవేటు ఉపాధ్యాయుడి ఇంట్లో శనివారం చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు... మదనపల్లె పట్టణం టీచర్స్ కాలనీలో నివాసముంటున్న శ్రీనివాసులు, అతడి భార్య సంధ్యారాణి ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తున్నారు. ఉదయం స్కూల్‌కు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చారు. ఇంటి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో బీరువా తెరచి చూసి చోరీ జరిగిందని గుర్తించారు. తాలూకా పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ రవికుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. బీరువాలో 250 గ్రాముల నగలున్నాయని వాటి విలువ దాదాపు రూ.10 లక్షల వరకు ఉంటుందని తెలిపారు రూ.15 వేల నగదు చోరీకి గురైనట్లు బాధితులు శ్రీనివాసులు పోలీసులకు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.